

ఎన్నికల్లో ఆదరించండి : ఖలీల్

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్ : నెల్లూరు సిటీ నియోజకవర్గ ఎంఎల్‌ఎగా తనను గెలిపించి ఆదరించాలని డిప్యూటీ మేయర్ ఎమ్‌డి ఖలీల్‌అహ్మద్ పేర్కొన్నారు. ఆదివారం రంగనాయకులపేటలోని మాదాల బాలతిమ్మయ్య కళ్యాణ మండపంలో ఆదివారం 49, 50, 52వ డివిజన్లకు సంబంధించి వైసిపి నేతలు, కార్యకర్తలతో నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎమ్‌డి. ఖలీల్‌అహ్మద్ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. నగర నియోజ కవర్గంలో ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి తనకు ఒక అవకాశం ఇచ్చి నగర నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా నియమించారని, ప్రతిఒక్కరూ సహకారం అందిం చాలని కోరారు. కార్పొరేటర్లు వందవాశి రాజేశ్వరీ, గుంజి జయలక్ష్మి, షేక్ అస్మ, ఎపి ఆగ్రో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొణిదల సుధీర్ ఉన్నారు.

మాట్లాడుతున్న ఎమ్‌డి ఖలీల్

వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో

మిగులు భూముల స్వాధీనం

పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీకి హద్దులు - పేదలకు అండగా నిలుస్తాం : వ్య.కా.సం

ప్రజాశక్తి -తోటపల్లి గూడూరు

అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ఇచ్చి గృహాలు నిర్మించాల్సిన అవసర ముందని, అందుకోసం పేదలు చేసే పోరాటాలకు వ్యవసాయ కార్మిక సంఘం అండగా ఉంటుందని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, టిపి గూడూరు మండలం, టిపి గూడూరు బిట్ -2పాపిరెడ్డి పాలెం గ్రామంలో 497 ,498 సర్వే నెంబర్లలోని 15 ఎరాల మిగులు భూమిని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆదివారం స్వాధీనం చేసుకుని జండాలు పాతారు. అందులో 500 మంది పేదలకు ఇళ్ల స్థలాల కోసం హద్దులు ఏర్పాటు చేసి స్థలాలను కేటా యించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళ పుల్లయ్య, జిల్లా అధ్యక్షులు జొన్నలగడ్డ వెంకమ్మ నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా వి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజల పక్షాన ప్రజల కోసం నిరంతరం వ్యవసాయ కార్మిక సంఘం పోరాటం చేస్తుం దన్నారు. పేదలందరికీ అండగా నిలుస్తామన్నారు. జిల్లాలోని ఇళ్లు లేని పేదలందరికీ పేదలు, వ్యవసాయ కార్మికులకు స్థలాలు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య , కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆలూరు తిరుపాలు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కాల్తీరెడ్డి రవణమ్మ, మధు, రామచంద్రయ్య వేగురి వెంకయ్య అల్లాడి గోపాల్ బట్ట పెద్దబ్బయ్య శౌరి పాల్గొన్నారు.

మిగులు భూముల్లో జెండాలు పాతుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ప్రజా ఉద్యమాల కోసం

ప్రజా నిధి సేకరణ : సిపిఎం

ప్రజాశక్తి నెల్లూరు సిటీ

ప్రజా ఉద్యమాల నిర్వహణ కోసం ప్రజానిధి సేకరిస్తున్నామని, ఆ కార్యక్ర మానికి ప్రజల్లో విశేష స్పందన లభిస్తుందని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాదాల వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. 36వ డివిజన్ అంబేద్కర్ నగర్,టిబి హాస్పిటల్ క్వార్టర్స్ లో సిపిఎం ఆధ్వర్యంలో ఇంటింటా తిరిగి సిపిఎం కార్యకర్తలు ప్రజానిధి వసూలు చేశారు. ఈ సందర్భంగా మాదాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల నిర్వహణకు సిపిఎం విరాళాలు సేకరణ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమానికి ప్రజల నుండి అనూహ్య స్పందన లభిస్తుందన్నారు. సిపిఎం నిరంతరం ప్రజల శ్రేయస్సు కోసమే పోరాటం చేస్తుందన్నారు. ఎటువంటి ప్రజా సమస్యపైనైనా సిపిఎం పోరాడేందుకు సిద్ధంగా ఉందన్నారు. అందుకే ప్రజల్లో సిపిఎంకు ఆదరణ లభిస్తుందన్నారు. రూరల్ కమిటీ సభ్యులు నందిపాటి మాలకొండయ్య, డి సురేష్ రెడ్డి,అప్పలనాయుడు, ఖాదర్ బాషా, గోపాల్,ప్రసాద్, షఫీ, రవి, రాజా,బేగ్,క్రిష్ణ బాబు, మోహన్ సింహాల్, సన్ని, గణేష్ పాల్గొన్నారు.

మెగా డిఎస్‌సి కాదు.. దగా డిఎస్‌సి..

ప్రజాశక్తి -నెల్లూరు సిటీ : వైసిపి పాలనలో విద్యార్థులు, యువకులు తీవ్రంగా నష్టపోయారని.. ప్రభుత్వం ప్రకటించింది మెగా డిఎస్‌సి కాదని.. దగా డిఎస్‌సి అని తెలుగు యువత జిల్లా అధ్యక్షుడు కాకర్ల తిరుమల నాయుడు విమర్శించారు. తెలుగు యువత, టిఎన్ ఎస్ఎఫ్, తెలుగు మహిళ నెల్లూరు పార్లమెంట్ నేతల ఆధ్వర్యంలో నెల్లూరు నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో 'నా మొదటి ఓటు చంద్రబాబు నాయుడుకు' అనే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుమలనాయుడు మాట్లాడుతూ ప్రతీ యేటా జాబ్ కేలండర్ ఇస్తామన్న జగన్ హామీ నీటి మూటగా మారిందన్నారు. యేటా సాక్షి కేలండర్ లు విడుదల అవుతున్నాయే తప్ప ఒక్క జాబ్ కేలండర్ విడుదల కావడం లేదని విమర్శించారు. అదిగో మెగా డీఎస్సి...ఇదిగో మెగా డీఎస్సి... అంటూ నిరుద్యో గులను 4 ఏళ్లపాటు ఊరించి 6100 పోస్టులతో దగా డిఎస్‌సి ప్రకటించారని విమర్శించారు. యువత కు ఉద్యోగాలు,ఉపాధి అవకాశాలు రావలంటే చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలన్నారు. టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా మాట్లాడుతూ 4ఏళ్లలో 4709 ప్రభుత్వ పాఠశాలల రద్దు , 50 వేల టీచర్ పోస్టుల భర్తీ గాలికి ఒదిలిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కిందని ఎద్దేవా చేశారు. తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి కొమరి.విజయమ్మ, కప్పిర. రేవతి మాట్లాడారు. కార్యక్రమంలో తెలుగు యువత రాష్ట్ర కార్యదర్శి వడ్లమూడి రమేష్, ప్రవీణ్, సాయి కిరణ్, వేణు, కమ్మ ప్రభాకర్, తెలుగు మహిళ నేతలు శ్రీదేవి టీఎన్ఎస్ఎఫ్ నాయకులు వసీం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న తెలుగు యువత జిల్లా అధ్యక్షులు తిరుమలనాయుడు

ప్రజల హృదయాల్లో ఎన్‌టిఆర్ : ఇంటూరి

ప్రజాశక్తి - లింగసముద్రం :రూ. 2 కిలో బియ్యం, పేదలకు పక్కా ఇల్లు, మహిళలకు ఆస్తిలో సమాన హక్కు, మండల వ్యవస్థ ఏర్పాటు వంటివి తీసుకొచ్చి పేదలకు చేరువైన నేత ఎన్‌టిఆర్ అని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని అన్నేబోయినపల్లి ఎస్‌సి కాలనీలో ఎన్‌టిఆర్ విగ్రహం ఏర్పాటుకు కాలనీ వాసులు శ్రీకారం చుట్టారు. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఎన్టీఆర్ పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిలో నిలిచిపోతారన్నారు. ఈ సందర్భంగా ఇంటూరి నాగేశ్వరరావు,మండల టిడిపి అధ్యక్షులు వేముల గోపాలరావులను కాలనీవాసులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పూరిమిట్ల మాల్యాద్రి,తెలుగు యువత అధ్యక్షులు అడపా రంగయ్య,ఎందోటి ప్రసాద్,గొర్రెపాటి సాంబయ్య, బాసం హరిబాబు, బండ్లమూడి రామయ్య,బొల్లినేని,ముళ్లపాటి మహేష్ ఉన్నారు.

ఇంటూరి నాగేశ్వరరావును, గోపాలరావును సత్కరిస్తున్న కాలనీవాసులు



రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-ఉలవపాడు :మండలంలోని కరేడు పంచాయతీ పరిధిలోని మూడో సచివాలయంలో రైతు భరోసా కేంద్రాన్ని ఆదివారం ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని కార్యాలయం ప్రారంభోత్సవం చేవారు. ఎంపిపి మస్తానమ్మ, జెడ్‌పిటిసి అరుణ, కరేడు సర్పంచి వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి చక్రవర్తి, సచివాలయ కార్యదర్శులు కాజా సద్దాం, నరేంద్ర ఉన్నారు.

14న పూర్వ విద్యార్థుల సమావేశం

ప్రజాశక్తి-కందుకూరు : కందుకూరు టిఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈనెల 14 , 15 తేదీల్లో న్యాక్ బృందం పరిశీలనకు రానుంది. ఆ బృందం కళాశాలలోని వసతులు, బోధనా పద్ధతులను పరిశీలించనుంది.అదే రోజున మధ్యాహ్నం రెండు గంటల నుండి పూర్వ విద్యార్థులు , తల్లిదండ్రులతో సమావేశం జరుగుతుందని ప్రిన్సిపాల్ ఎం రవి కుమార్ తెలిపారు. పూర్వ విద్యార్థులు చెప్పే అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని కళాశాల గ్రేడ్‌ను నిర్ణయించే అవకాశముందన్నారు. ఈ నేపథ్యంలో పూర్వ విద్యార్థులు హాజరుకావాలని రవి కుమార్ విజ్ఞప్తి చేశారు.

వైసిపి పాలనలో బిసిలకు అన్యాయం : టిడిపి

ప్రజాశక్తి - లింగసముద్రం : వైసిపి పాలనలో బిసిలను అన్ని విధాలుగా అన్యాయం జరిగిందని, రాబోయే ఎన్నికల్లో సిఎం జగన్మోహన్‌రెడ్డికి తగిన గుణపాఠం చెప్పాలని కందుకూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. టిడిపి ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రమైన లింగసముద్రంలోని వేముల అంజయ్య కళ్యాణ మండపంలో జయహో బిసి కార్యక్రమం జరిగింది. టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ దివి శివరాంతో కలిసి నాగేశ్వరరావు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ టిడిపి ఆవిర్భావం నుంచి బిసిలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదుగుదలకు ఎన్నో అవకాశాలు కల్పించిందని గుర్తు చేశారు. చంద్రబాబునాయుడు అనేక మంది బిసిలను మంత్రులుగా చేశారన్నారు. టిడిపి అంటే బిసిల పార్టీగా 14 ఏళ్ల చంద్రబాబు పరిపాలన సాగిందన్నారు. చంద్రబాబు ప్రవేశపెట్టిన ఎన్నో పథకాలను జగన్ వచ్చిన తర్వాత నిలిపివేశాన్నారు. రానున్న ఎన్నికల్లో కందుకూరు నియోజకవర్గంలో బిసిలంతా తనకు మద్దతు పలకాలని కోరారు. టిడిపి,జనసేన ఆధ్వర్యంలో ఏర్పడబోయే ప్రభుత్వంలో బిసిలకు అన్ని విధాలుగా న్యాయం చేస్తామని నాగేశ్వరరావు హామీ ఇచ్చారు. టిడిపి మండల అధ్యక్షులు వేముల గోపాలరావు, జనసేన మండల అధ్యక్షులు అంగులూరి నరసింహారావు, విశ్వనాధపురం సర్పంచ్ బొల్లినేని నాగేశ్వరరావు,మండల టిడిపి ఉపాధ్యక్షులు నారిబోయిన నారాయణ, మండల తెలుగు యువత అధ్యక్షులు అడపా రంగయ్య ,టిడిపి మండల ప్రధాన కార్యదర్శి పూరిమిట్ల మాల్యాద్రి,టిడిపి నాయకులు అర్థాకుల చిన్న సత్యం, క్రిష్ణయ్య,గొర్రెపాటి సాంబయ్య, ఎందోటి ప్రసాద్,గొల్లపల్లి వెంకటేశ్వర్లు,మద్దెల రామారావు, కిలారి రమణయ్య,బొచ్చు మాల్యాద్రి ఉన్నారు.

మాట్లాడుతున్న ఇంటూరి నాగేశ్వరరరావు

డ్రెయిన్లను పరిశీలిస్తున్న మేయర్ స్రవంతి

దోమల నివారణకు చర్యలు : మేయర్

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ :నగరంలో దోమల నివారణకు ప్రత్యేక చొరవ చూపుతున్నామని, స్వచ్ఛంద సంస్థలు కూడా ముందుకు వస్తున్నాయని మేయర్ స్రవంతి జయవర్ధన్ పేర్కొన్నారు. నగర పాలక సంస్థ పరిధిలోని 17 వ డివిజన్ పరిధిలోని అపోలో హాస్పిటల్ సమీపంలోని డ్రెయిన్ కాలువల్లో దోమల నివారణా చర్యల్లో భాగంగా ఆదివారం కాలువల్లో ఆయిల్ బాల్స్ వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్థానిక కార్పొరేటర్ సుధాకర్ నేతత్వంలో, ప్రియదర్శిని స్వచ్ఛంద సంస్థ సహకారంతో దోమల నివారణకు డివిజన్ వ్యాప్తంగా డ్రెయిన్ కాలువల్లో ఆయిల్ బాల్స్ వేయిస్తు న్నామన్నారు. కార్పొరేటర్ సుధాకర్, వైసిపి నాయ కులు, ప్రియదర్శిని క్లబ్ ప్రెసిడెంట్ దుగ్గిశెట్టి సుధారాణి, సెక్రటరీ చాటకొండు కళ్యాణి, ట్రెజరర్ సామ స్వర్ణలత, నగర పాలక సంస్థ శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సూచనలు

ప్రజాశక్తి -ఉలవపాడు :ఉలవపాడు మండల శాఖ గ్రంథాలయంలో ఆదివారం"చదవటం మాకిష్టం" కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు నీతి కథలు, జాతీయ నాయకుల జీవిత చరిత్రలు విద్యార్థుల చేత చదివి ంచారు. ఈ మేరకు ఈ విషయాన్ని గ్రంథ పాలకులు డి. కోటేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా విద్యా ర్థులకు పలు సూచనలు చేశారు.

చోరీ కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి - నెల్లూరు :వ్యసనాలకు బానిసలై సులభంగా నగదు సంపాదించేందుకు దోపిడీలకు అలవాటు జీవనం సాగిస్తున్న ముగ్గురు నిందితులను పోలీ సులు అరెస్టు చేసినట్లు రూరల్ డిఎస్‌పి వీరాంజనేయ రెడ్డి తెలిపారు. ఆదివారం నగరం లోని రూరల్ డిఎస్‌పి కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ గత నెల 27వ తేదీన ధనలక్ష్మి పురం నుంచి కలివెల పాలెం వెళ్లే రోడ్డు లో ఉన్న సామంతుల వారి తోటలో నివాస ముంటున్న బుండి శ్రీ హరి తన కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత పనులు నిమిత్తం నగరానికి వెళ్లి తిరిగి సుమారు 12.00 సమయంలో ఇంటికి చేరారు. తమ ఇంటిలోకి గుర్తు తెలియని వ్యక్తులు ప్రవేశించి తాళంను పగులకొట్టి లోపలకు వెళ్ళి బీరువాలో ఉన్న 12 సవర్ల బంగారు, 400 గ్రాములు దొంగలించుకొని వెళ్ళినట్లు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. సాంకేతికత ఆధారంగా నిందితుల ఆనవాళ్లు గుర్తించి, "దర్యాప్తు చేసి ముగ్గు రు నిందితులను అరెస్టు చేశారు. ఆముగ్గురు నిందితులు షేక్ గౌస్ బాషా, లింగుబేరి రాంబాబు, నడింపల్లి గోపి నేరచరిత్ర కలిగిన వారేనన్నారు. ఆ ముగ్గురు నిందితుల నుంచి సుమారు 25 సవర్ల బంగారు, ఒక బైక్, రు.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన రూరల్ సిఐ పి. సుబ్బరావు, మహిళా ఎస్ ఐ కె. స్వప్న, ఐడి పార్టీ ఏ ఎస్ ఐ కె. గిరిధర్ రావు, హెడ్ కానిస్టేబుల్ జి. గంగాదర్, పోలీ స్ కానిస్టేబుల్ సతీష్, పలువురు సిబ్బందిని డిఎస్‌పి అభినందించారు.

వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి

మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

కార్యకర్తలకు అండగా ఉంటాం..!

ప్రజాశక్తి - నెల్లూరు సిటీ

ప్రతి కార్యకర్తకు అండగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నామని.. గెలుపే లక్ష్యంగా అడుగులు వేసి ప్రజల్లో విస్తృత ప్రచారం చేయాలని నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు.నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధిలోని 24, 32,17వ డివిజన్లలో వివిధ పార్టీకి చెందిన నేతలు ఆదివారం నెల్లూరు రూరల్ ఎంఎల్‌ఎ కార్యాలయంలో ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి, టిడిపి నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఎంఎల్‌ఎ కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో వాడవాడలా యువత, మహిళలు, రైతులు పెద్దఎత్తున టిడిపిలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. 57 శాతం ఓట్లతో, 160 సీట్లతో టిడిపి, జనసేన పార్టీ కూటమి అధికారంలోకి వస్తుందని,చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రికావడం ఖాయమన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు శ్రీ శ్రీనివాసులు, చెవిరెడ్డి అశోక్ రెడ్డి, పులి హరికష్ణ యాదవ్, శేషా రెడ్డి, ఉయ్యాల జగన్ మోహన్, భాస్కర్ నాయుడు, బత్తల రాము, శేషు, శీనయ్య, బైనమూడి సుధాకర్, మనోహర్ రెడ్డి, గుమ్మా పెంచలయ్య, రవి కుమార్, తాళ్లూరు హరి కుమార్, మునీర్ ఉన్నారు.

బాలకోటయ్య మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యంత

బాలకోటయ్య మృతి తీరని లోటు : వైసిపి

ప్రజాశక్తి-కందుకూరు :కందుకూరు అర్బన్ పరిధిలోని శ్రీరామ కాలనీ సచివాలయం- 9లో చేరిన క్లస్టర్ 7 లో ఉన్న గృహసారధి కలిశెట్టి బాలకోటయ్య మృతిచెందారు. ఆయన మృతి వైసిపికి తీరని లోటు అని ఆ పార్టీ నాయకులు పలువురు పేర్కొన్నారు. బాలకోటయ్య మృతి విషయం తెలుసుకున్న ఎంఎల్‌ఎ మానుగుంట మహీధర్‌రెడ్డి బాలకోటయ్య కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి సానుభూతి తెలిపారు. బాలకోటయ్య భౌతికకాయాన్ని జె సి యస్ కో ఆర్డినేటర్ ముప్పవరపు కిషోర్, సచివాలయం కన్వీనర్లు దేవరకొండ ఆదిలక్ష్మి, చనమాల కోటేశ్వరరావు సందర్శించి నివాళులర్పించారు.కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - నెల్లూరు :ప్రభుత్వ ఉద్యోగుల ఆర్థికమైన సమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపాలని జిల్లా జెఎసి చైర్మన్ మన్నేపల్లి పెంచల రావు డిమాండ్ చేశారు. ఆదివారం విజయవాడ లో జరిగిన ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి ఎపి జెఎసి రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర జెఎసి పిలుపు మేరకు జిల్లాలోని అన్ని ఉద్యోగ సంఘా లతో సమావేశం ఏర్పాటు చేసి ఉద్యమ కార్యా చరణ ప్రకటిస్తామని తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన ఆర్థికపరమైన సమస్యలు, ఆగి పోయిన సరెండర్ లీవ్‌లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఐ ఆర్ 30 శాతం వెంటనే ప్రకటిం చాలన్నారు. రాష్ట్ర జెఎసి కన్వీనర్ నాయుడు వెంకట స్వామి, జిల్లా కోశాధికారి బండారుపల్లి వెంకటేశ్వర్లు,హాస్టల్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఈదురు విజయ కుమార్, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు రమేష్ బాబు,ఎస్ చిరంజీవి,ఫార్మసిస్ట్ అసోసియేషన్ రాష్ట్రఅధ్యక్షులు శ్రీనివాసులు, నగర అధ్యక్షులు చిలకా రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జెఎసి నాయకులు

వధూవరులకు ఆశీర్వాదం

ప్రజాశక్తి-కందుకూరు :పట్టణంలోని ఎస్‌విఎస్ కళ్యాణ మండపంలో మంగపాటి వెంకటేశ్వర్లు, లీలావతి కుమారుడు శివాజీ చౌదరి, దివ్యల వివాహ కార్యక్రమానికి టిడిపి ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు హాజరై నూతన వధూ వరులను ఆశీ ర్వదిం చారు. నాయకులు కంద్రా మాల్యాద్రి, వడ్డెళ్ళ రవిచంద్ర, షేక్ సలాం ఉన్నారు.

చెవిటి మిషన్లు పంపిణీ చేసిన కాకర్ల సురేష్

చెవిటి మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-ఉదయగిరి/కలిగిరి

వింజమూరు మండల కేంద్రంలోని బొమ్మరాజు చెరువుపల్లి గ్రామంలో కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం కాకర్ల సురేష్ చెవి, ముక్కు గొంతు సమస్యలతో బాధపడుతున్న వారికి అనుభవజ్ఞులైన డాక్టర్లతో వైద్య సేవలందించడానికి మెడికల్ క్యాంపును నిర్వహించారు. ఈ క్యాంపునకు నియోజకవర్గ నలుమూలలు నుండి చెవి, ముక్కు గొంతు సమస్యల వైద్య నిమిత్తం వచ్చిన, వినికిడి సమస్య ఉన్న బాధితులను మెరుగైన వైద్య పరీక్షలు చేయించి, ఉచితంగా మందులను పంపిణీ చేసి, చెవిటి మిషన్లు అవసరమైన 27 మందికి కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత నియోజకవర్గ టిడిపి నాయకులు కాకర్ల సురేష్ చేతుల మీదగా ఉచితంగా అందించి వారికి భోజన సదుపాయం కల్పించారు. అనంతరం వచ్చిన దివ్యాంగుల కుటుంబ సభ్యులు కాకర్ల సురేష్‌ను అభినందించారు. అలాగే సోమవారం వింజమూరు మండలంలోని గణేష్‌పురం రామాలయం వద్ద ఎన్‌టిఆర్ సంజీవిని ఆరోగ్య రథం అందిస్తూ వైద్య సేవలను ప్రతిఒక్కరూ ఉపయోగించుకోవాలని ఆయన కోరారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న చెన్నారెడ్డి మనుక్రాంత్‌రెడ్డి

వసతుల కల్పనలో ప్రభుత్వం విఫలం

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో వైసిపి ప్రభుత్వం దారుణంగా వైఫల్యం చెందిందని జనసేన జిల్లా అధ్యక్షుడు చెన్నారెడ్డి మనక్రాంత్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం 53వ డివిజన్ పరిధిలోని గాంధీ గిరిజన సంఘంలో ఆయన జనసేన నెల్లూరు నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజై బాబుతో కలిసి జనం కోసం జనసేన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు. త్వరలో జరగబోయే ఎన్నికల్లో టిడిపి జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ ప్రభుత్వంలో నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగిపోయాయని విమర్శించారు. కరెంట్ ఛార్జీలు షాక్ కొట్టేలా ఉన్నాయన్నారు. ప్రజల ఆదాయ వనరులు తగ్గి దేదీప్యమానంలో జీవనం సాగిస్తున్నారన్నారు. జగన్ పేరెత్తితే జనాలకు చిర్రెత్తుకొని వస్తుందని ఎద్దేవా చేశారు. మరో రెండు నెలలలో జగన్ పీడ విరగడ ఖాయమన్నారు. ప్రజా ప్రభుత్వం కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని తెలిపారు. రానున్న ఎన్నికలలో ప్రభంజనం తథ్యమన్నారు. పేద ప్రజలకు అందించాల్సిన బియ్యం పాలు చోట్ల సక్రమంగా పంపిణీ జరగడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యం పంపిణీ అంశంలో మీనమేషాలు లెక్కిస్తున్నారన్నారు. నగరంలో దోమల బెడద తీవ్రంగా ఉందన్నారు. సిబ్బంది ఫాగింగ్ చేయడం లేదన్నారు. బ్లీచింగ్ చల్లడం పారిశుధ్య పనులు నిర్వహించడం లేదన్నారు. విష జ్వరాలు ప్రబలుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మురుగునీరు వెనక్కి చొచ్చుకొస్తోందన్నారు. కార్యక్రమంలో జనసేన 53, 54 డివిజన్ల క్లస్టర్ ఇన్‌ఛార్జి షేక్ అలియా, నగర కార్యదర్శి జీవన్, ప్రతాప్, నగర నాయకులు శ్రీకాంత్, సినీవరపు అజయ్ బాబు, ఆనంద్, 53, 54 డివిజన్ల టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి జహీర్, 53 డివిజన్ ఇన్‌ఛార్జి సుధీర్, 53 డివిజన్ అధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, నాయకులు చంద్రమౌళి, 53 డివిజన్ కంటెస్టింగ్ కాండేట్ చంద్ర, రమాదేవి, రవి, శశి, సంపత్, రాష్ట్ర ఎస్‌టి వివాదా కార్యదర్శి నాని, తదితరులు పాల్గొన్నారు.

నారాయణను కలిసిన కాప్స్‌రాక్స్ టీం

ప్రజాశక్తి-నెల్లూరు అర్బన్

కాప్స్ రాక్స్ (ఇఆర్) నెల్లూరు టీం సభ్యులు మాజీ మంత్రి, టిడిపి నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొంగూరు నారాయణను మర్యాద పూర్వకంగా కలిసి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాప్రభుత్వం ఏర్పాటుకు కలిసి నడుస్తామని ఎన్నికల్లో గెలిపించేందుకు కె ఆర్ టీం సభ్యులకు బాధ్యతలు ఇవ్వాలని కోరారు. స్టేట్ పిఆర్‌ఓ పసుపర్తి కిషోర్, గాదిరాజు అశోక్, కార్యదర్శి వెంకట కిషోర్, శివ, ప్రసాద్, సుధీర్, జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కిషోర్ గునుకుల, తదితరులు పాల్గొన్నారు.

వెంకయ్య నాయుడును కలిసిన బొమ్మిరెడ్డి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పద్మ విభూషణ్ గ్రహీత, మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడును హైదరాబాదులో ఆయన నివాసంలో దివంగత మాజీ ఎంఎల్ఏ బొమ్మిరెడ్డి సుందర రామిరెడ్డి మనవడు, బివిఎన్ చారిటబుల్ ట్రస్ట్ అధినేత బొమ్మిరెడ్డి తారక్ నాథ్ మర్యాదపూర్వకం కలిసిన శాలువాతో పూల బొకేతో సన్మానించారు. మాజీ జెడ్పి చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్ర రెడ్డి కుమారుడి వివాహానికి పెళ్లి పత్రిక ఇచ్చి ఆహ్వానించారు.

ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-పొదలకూరు

పట్టణంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు. తొలుత 108మంది అమ్మవారి మహిళ భక్తులు కలశములతో అమ్మవారి దేవాలయము నుండి శివాలయం వరకు వెళ్లి అక్కడి నుంచి కలశాలతో నీటిని, అమ్మవారిని పల్లకిలో ఊరేగించారు. ఆ కలశ జలంతో అమ్మవారికి పంచామృత అభిషేకం, లలిత హోమము, సహస్రనామ పారాయణము, అన్నదాన కార్యక్రమము, తీర్థప్రసాదములు పంచి పెట్టారు. ఉభయకర్తలుగా ఉకులూరు మధు-నిరజ, హేమంత్ కుమార్ - అనూష, రాజా సుబ్బారావు - సుజాత, సురేంద్రబాబు, లక్ష్మీనారాయణ, సాయి కుమార్, ఆర్యవైశ్య మండల అధ్యక్షులు తన్నీరు.సురేష్, రావిపూడి.ధనుంజయరావు, వీరప్రకాశం దేవాలయ వ్యవస్థాపక పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్ : ఆత్మకూరు పట్టణంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో అమ్మవారి అగ్ని ప్రవేశ మహోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ముందుగా అమ్మవారి మూల విరాట్‌గా విశేష సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేక వాహనంపై చేర్చి మహిళల వడి బాల బియ్యం, పసుపు కుంకుమలు, ఎండు కొబ్బరి తాంబూలాలతో సారె సమర్పించారు. అనంతరం అగ్నిప్రవేశ కార్యక్రమం ఆలయ ప్రాంగణంలో హోమం నిర్వహించారు. ఉభయకర్తలుగా పోకూరు జ్ఞానయ్య దంపతులు వ్యవహరించారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ కమిటీ నిర్వాహకులు దోర్నాదుల సురేష్ బాబు, హజరత్తయ్య తదితరులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ప్రపంచ విప్లవోద్యమ నేత 'లెనిన్'

- శత వర్ధంతి సభలో వక్తలు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

లెనిన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రపంచ శ్రామిక ప్రజల నాయకుడు, ఉపదేశకులు మార్క్స్, ఏంగెల్స్ విప్లవ సిద్ధాంతాల ప్రముఖ ప్రతిపాదకుడు సోవియట్ విప్లవ మేధావి, రాజ్య స్థాపకుడు వి ఐ లెనిన్ అని ప్రపంచానికి తెలుసునని వక్తలు కొనియాడారు. ఆదివారం స్థానిక చెర్లో రమణారెడ్డి భవన్‌లో సిపిఎం పట్టణ కార్యదర్శి డేవిడ్ రాజు, పలువురు పెద్దల ఆధ్వర్యంలో లెనిన్ శతవర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ లెనిన్ ప్రపంచ నాయకుడు అని తెలియజేశారు. మార్క్స్ తదనంతరం విప్లవ కార్యోద్యమం ప్రపంచానికి అందించిన గొప్ప మేధావి లెనిన్, 20వ శతాబ్దంలో ప్రపంచ గమనాన్ని కోటానుకోట్ల మానవ మెదళ్లను కదిలించి, అనంత జన సమూహాలను ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రభావితం చేశారని కొనియాడారు. అందుకే 100ఏళ్ల తర్వాత కూడా లెనిన్‌కు సంబంధించిన వర్ధంతి సభలు ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటున్నారని తెలిపారు. ఆయన వర్ధంతి సభలు పేదల పక్షాన నిలబడిన పార్టీలు, సంఘాలు ఆయన వర్ధంతి సభలు నిర్వహించుకుంటూ ఉన్నారన్నారు. బానిసత్వం పోవాలంటే నిత్యం పోరాటాలతోనే సాధ్యమని, ఎవరికి వారు పోరాడి సాధించుకోవాలని పలువురు వక్తలు తెలిపారు. రైతులు, కార్మికులు సంఘటితమై ఉద్యమాలు చేసేదే బానిసత్వం దానికంటే అదే పారిపోతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కౌలు రైతుసంఘం ఉపాధ్యక్షులు గంటా లక్ష్మీపతి, సిఐటియు జిల్లా నాయకులు జి వి శివప్రసాద్, సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు ఆత్మకూరు నాగయ్య, కొండ మూరి హజరత్తయ్య, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్.సంధాని, ఏపి రైతు సంఘం అధ్యక్ష కార్యదర్శులు లక్కు కృష్ణ ప్రసాద్, కృష్ణమోహన్, సిపిఎం నాయకులు ఎం.నాగేంద్ర, ఆళ్ల హజరత్తయ్య, వాగాల శ్రీహరి, సాలారుద్దీన్, రమణయ్య, మహబూబ్ బాషా, కొండా లక్ష్మమ్మ, గద్దర్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

సిపిఎం నేతల సేవలు మరువలేనివి

ప్రజాశక్తి-దగదర్తి

మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడిన సిపిఎం సీనియర్ నాయకులు కర్ర పోలయ్య, మారుబోయిన వెంకట రమణయ్య సేవలు మరువలేనివని సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. ఇటీవల అకాల మరణం చెందిన సిపిఎం సీనియర్ నాయకులు కర్ర పోలయ్య, మారుబోయిన వెంకట రమణయ్య అకాల మరణంతో స్థానిక మండల కేంద్రమైన దగదర్తిలో జక్కా వెంకయ్య విజ్ఞానం కేంద్రంలో సంతాప సభను ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సిపిఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పాల్గొని వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిపిఎం నాయకులు మరణించడం చాలా బాధాకర విషయం అని, వారు లేని లోటు ఎవరు పోర్చలేనిదన్నారు. ఎప్పుడు ప్రజల మధ్యలో తిరుగుతూ ప్రజల సమస్యపై పోరాడుతూ వ్యక్తులను కొనియాడారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ వెంకమరాజు, విద్యా చరణ్ పులిగొండ్ల శ్రీరాములు, గోగుల శ్రీనివాసులు, గండవరపు శేషయ్య, కృష్ణారెడ్డి, మాదాల రాము, వంటేరు సుధాకర్, గోపసాని రమేష్, విజయ్ కుమార్, మంద మహేష్, చల్లా మాల్యాద్రి, ఎస్ కే కాలేషా, పెరికల మాల్యాద్రి, నారాయణపురం, దామవరం, అనంతవరం, ఉప్పలపాడు, తురుమెళ్ళ, చవటపుత్తేడు తదితర గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నాదెండ్ల మనోహర్‌కు ఆహ్వానం

ప్రజాశక్తి-కావలి

జనసేన కావలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అళహరి సుధాకర్ కొంతమంది నాయకులతో కలిసి మంగళగిరి పార్టీ ఆఫీస్‌లో పొలిటికల్ అఫైర్స్ కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను కలిసి కావలి పార్టీ ఆఫీస్ ప్రారంభానికి రావాలని ఆహ్వానించారు. ఈ సందర్భంగా మనోహర్ నెల్లూరు జిల్లా మొత్తంలో కావలి టికెట్ కావాలని గట్టిగా కోరుతున్నానని ఇప్పుడు బిజెపి కూడా పొత్తులో ఉంది కాబట్టి సమీకరణాలు మారబోతున్నాయని, సీట్లసర్దుబాటులో చాలా మార్పులు ఉండబోతున్నాయని తెలిపారు. కావున పొత్తులో ఏయే పార్టీలు ఎక్కడెక్కడ పోటీ చేసేదీ త్వరలో నిర్ణయిస్తాయమని, కావున ఇప్పుడు సీట్లలో మార్పులు తప్పక ఉంటాయని అలానే కావలి అభ్యర్థిగా జనసేన పార్టీకే కావాలి అని గట్టిగా అడుగుతున్న సందర్భంలో అళహరి సుధాకర్‌ను పరిగణలోకి తీసుకుంటామని సూచన ప్రాయంగా చెప్పారన్నారు. ఈ మధ్య కొంతమంది తనని కలిసినప్పుడు వారితో ప్రోటోకాల్ అనేది ఉంటుందని మీరు ఇన్‌ఛార్జితోనే కలిసి పనిచేయాలని అప్పుడే వారికి గుర్తింపు వస్తుందని సూచించినట్లు తెలిపారు. అదే సందర్భంగా కావలి నియోజకవర్గంలో అత్యంత పెద్ద పార్టీ ఆఫీస్ ఓపెన్ చేస్తున్నందుకు అళహరి సుధాకర్‌ను వారికి సహకరించిన నాయకులకు అభినందనలు తెలిపారు. నాదెండ్లను కలిసిన వారిలో కృష్ణయ్య, రుషికేశ్, సుధీర్, ఆలా శ్రీనాథ్, వెంకయ్య, అగస్టిన్, మురళి, శ్రీను, పాని, శ్రీకాంత్, సందీప్, తదితరులు హాజరయ్యారు.

మత్తు పదార్థాలను విడనాడాలి

ప్రజాశక్తి-ఉదయగిరి

మత్తు పదార్థాలను నిర్మూలిద్దాం.. ఉత్తమ సమాజాన్ని నిర్మిద్దాం.. ప్రతి ఒక్కరూ కదలి రావాలని జమాతే ఇస్లామీ హింద్ ఉదయగిరి శాఖ జిల్లా అధ్యక్షులు ఇస్మాయిల్ స్థానిక అధ్యక్షుకు సిద్దీక్ పేర్కొన్నారు. ఆదివారం ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనిషి తనకు తాను తన శరీరాన్ని మనసును నష్టపరచుకునే అధికారం మనిషికి లేదని అంతిమ దైవ గ్రంథం దివ్యఖుర్ఆన్ తెలియజేస్తుందన్నారు. తమను మీరు చంపుకోకుండా అలాగే ఇస్లామ్ మద్య సేవనాన్ని ఇతర చెడు అలవాట్లను సమాజం నుండి శాశ్వతంగా నిషేధించిందని తెలిపారు. సారాయి, జూదం, దైవేతర ప్రదేశాలు, పాచికల ద్వారా జోస్యం ఇవన్నీ అసహ్యకరమైన షైతాను పనులు వాటిని విసర్జించిన్నపుడే సాఫల్య భాగ్యం కలిగే అవకాశం ఉందన్నారు. సమాజాన్ని సర్వనాశనం చేసే ఈ మత్తు మహమ్మారి నుండి కాపాడి ఒక ఉత్తమ సమాజాన్ని నిర్మించడానికి జమాతే ఇస్లామీ హింద్ రాష్ట్ర వ్యాప్తంగా ఈ అంశంపై పలుకోణాలలో సమాజాన్ని జాగృత పరుస్తుందన్నారు. 8వతేదీ నుంచి 18 వరకు చేపడుతున్న ఈ కార్యక్రమంలో మొదటిరోజు మీడియాతో అవగాహన రెండోరోజు జుమా ప్రసంగాలు మూడవరోజు విఐపిలతో కలవడం అలాగే గడపగడపకు కౌన్సిలింగ్ నిర్వహణ స్కూల్లో ఎస్ఎ రైటింగ్ కంపిటిషన్స్ మహిళలలో అవగాహన బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగకుండా అధికారుల సహకారం మినీ బహిరంగ సభ తదితర కార్యక్రమాలు 18వ తేదీ వరకు కార్యక్రమాలన్నీ విజయవంతంగా నిర్వహించేందుకు ప్రణాళిక రూపొందించి ముందుకు సాగుతున్నామన్నారు.

యునాని వైద్యంపై అవగాహన అవసరం

- రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.పద్మజాతి

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

మాట్లాడుతున్న డాక్టర్ జి.పద్మజాతి

యునాని వైద్యంపై క్షేత్రస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయుష్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.పద్మజాతి పేర్కొన్నారు. ఆదివారం ఆత్మకూరు పట్టణంలో ఘనంగా నిర్వహించిన జాతీయ యునాని వైద్య విధానం 8వ వార్షికోత్సవ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్మకూరులోని యునాని వైద్యశాల వద్ద డాక్టర్ అబ్దుల్ రజాక్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.పద్మజాతి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. మొదట యునాని ఎనిమిదవ వార్షికోత్సవం సందర్భంగా ఆత్మకూరు పట్టణంలో గొప్ప ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మహిమలూరు ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు డాక్టర్ అనూష, వైద్యశాల పరిధిలోని యునాని వైద్యశాల సిబ్బంది, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఇతర వైద్య సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా యునాని వైద్యం ప్రాధాన్యత తెలుపుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యునాని వైద్యశాలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన ఆయుష్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ జి.పద్మజాతి, గుడ్లూరు, బుచ్చిరెడ్డిపాలెం ప్రాథమిక వైద్యశాల వైద్యురాలు డాక్టర్ విమల, డాక్టర్ త్రినేత్రి హాజరయ్యారు. స్థానిక యూనాని వైద్యశాల డాక్టర్ అబ్దుల్ రజాక్, వారి సిబ్బంది కార్యక్రమం పర్యవేక్షించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ పద్మజాతి మాట్లాడుతూ యూనాని వైద్యంతో మెరుగైన వైద్య సేవలు అందుతూ ఎన్నో రోగులు నయమవుతున్నాయని ఇటువంటి ప్రాచీన వైద్య విధానం ద్వారా మొండి వ్యాధులు సైతం నయమవుతున్నాయని తెలిపారు. యూనాని వైద్యం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. సభ అనంతరం అతిథులకు, వైద్యశాల ఉత్తమ సేవ సిబ్బందికి ప్రత్యేకంగా సత్కరించి మెమోటోలు అందించారు. అనంతరం డాక్టర్ జి.పద్మజాతి యూనాని వైద్యశాలను సందర్శించి అక్కడి రికార్డులను పరిశీలించారు.



నిత్యావసరాలు అందజేత

ప్రజాశక్తి-కావలి

డిఆర్ విశ్వోదయ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం కావలి వెంగళరావు నగర్‌లోని తమ కార్యాలయంలో 60మంది నిరుపేద వృద్ధులకు రూ.60వేలు విలువ చేసే బియ్యం, నిత్యావసర సరుకులు ఉచితంగా పంపిణీ చేశారు. సబ్‌జైలు సూపరింటెండెంట్ సి.వెంకట సుబ్బయ్య ముఖ్యఅతిథిగా మాట్లాడుతూ విద్యాప్రదాత డి.ఆర్. పేరుపై పేద వృద్ధులను ఆదుకుంటున్న వారి కుమారులు వినయ్‌కుమార్ రెడ్డి, విద్యాధర్‌కుమార్ రెడ్డిలకు అభినందనలు తెలిపారు. మంచి విద్యతోపాటు, సమాజానికి సేవ చేయడం గొప్ప విషయమని, కార్యక్రమంలో విద్యార్థులను కూడా భాగస్వాములను చేస్తూ వారిలో కూడా సామాజిక స్పృహ, సేవాభావం నింపడం బహు ప్రశంసనీయమన్నారు. కార్యక్రమంలో విశ్వోదయ రెక్టార్ దొడ్లవినయ్ కుమార్ రెడ్డి, సేవాసమితి డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సభ్యులు సతీష్ సింగ్, రంగనాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కావ్యక్రిష్ణారెడ్డికి అభినందనలు

ప్రజాశక్తి-కావలి

కావ్యక్రిష్ణారెడ్డికి అభినందనలు తెలియజేస్తున్న నాయకులు

కావలి పట్టణ 18వ వార్డు ఇన్‌ఛార్జి శానం హరి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలు కావలి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కావ్య క్రిష్ణారెడ్డికి అభినందనలు తెలియజేసేందుకు ఆదివారం తరలివచ్చారు. కావ్య క్రిష్ణారెడ్డిని శాలువాలు, గజమాలలతో సత్కరించారు. 18వ వార్డు ప్రజలు పడుతున్న ఇబ్బందులను కావ్య క్రిష్ణారెడ్డికి తెలియజేశారు. ఈ సందర్భంగా క్రిష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో చంద్రబాబును, కావలిలో తనను గెలిపించాలన్నారు. తాను కూడా పేదరికం నుండి కష్టాల నుండి వచ్చిన వ్యక్తినని, ఆకలి విలువ, ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తిగా సమస్యలను పరిష్కరిస్తానన్నారు. కావలిలో ఒక ఇండస్ట్రియల్ కారిడార్ రావాల్సిన అవసరం ఉందని, దాని కోసం కృషి చేస్తానని తెలిపారు. కూతవేటు దూరంలో ఉన్నానని, ఎప్పుడు అందుబాటులో ఉండే వ్యక్తినని అన్నారు. తుపాన్ నగర్, ఇందిరా నగర్, బాలకృష్ణారెడ్డి నగర్ ప్రజల కష్టాలు తీర్చడానికి రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి నిర్మాణం ఒకటి అవసరమని, దానికి కృషి చేస్తానని తెలిపారు. టిడిపి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా ప్రస్తుత పథకాలు కొనసాగుతూ, కొత్తగా పథకాలతో పాటు చంద్రబాబు ప్రవేశపెట్టిన భవిష్యత్ గ్యారెంటీ పథకాలు కూడా వస్తాయని తెలిపారు. 18వ వార్డులో ప్రతిఒక్క ఇంటికి కొళాయి, ముస్లిముల కోసం మరో శ్మశాన వాటిక ఏర్పాటు చేస్తామని వారికి హామీనిచ్చారు. మీరు చూపిన ప్రేమ, ఆప్యాయత, అనురాగం నిండు నూరేళ్ల గుర్తుంచుకుంటానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కావలి పట్టణ అధ్యక్షులు గుత్తికొండ కిషోర్ బాబు, పట్టణ కార్యదర్శి జ్యోతిబాబురావు, రాష్ట్ర కార్యదర్శి మలిశెట్టి వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షులు మన్నవ రవిచంద్ర, కండ్లగుంట మధుబాబు నాయుడు, 18వ వార్డు ఇన్‌ఛార్జి శానం హరి, మాజీ కౌన్సిలర్లు, తెలుగుదేశం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా పరిశుభ్రత పనులు

ప్రజాశక్తి-ఆత్మకూరు అర్బన్

పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్ ప్రాంగణంలో వందలాదిమంది వాకింగ్ చేస్తుంటారు. ఆవరణంలో చెత్తాచెదారం పేరుకుపోవడం గమనించిన ఆవరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని ఉద్దేశంతో పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ మల్లికార్జున, పూర్వ విద్యార్థులు, విద్యుత్ శాఖ ఉద్యోగి షేక్ మస్తాన్, ఉపాధ్యాయులు రొట్టె వెంకటేశ్వర్లు, విశ్రాంతి ఉద్యోగ శ్రీరాములు ఆదివారం గవర్నమెంట్ హైస్కూల్‌లోని ఉన్న చెత్త చెదారాన్ని ఏరి పరిశుభ్రం చేశారు. ప్రతి ఆదివారం ఆవరణంలో ఈ పరిశుభ్రత కార్యక్రమాన్ని వారు నిర్వహిస్తున్నారని తెలిపారు.

ఉదయగిరి టిడిపి అభ్యర్థిగా పోటీచేస్తా..

ప్రజాశక్తి-కలిగిరి

మాట్లాడుతున్న మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకటరామారావు

కార్యకర్తలు, నాయకులు ఎవరూ అధైర్య పడవద్దని ఉదయగిరి నియోజకవర్గానికి టిడిపి తరపున పోటీ చేసేది తానేనని, గాలివార్తలు నమ్మవద్దని మాజీ ఎంఎల్ఎ బొల్లినేని వెంకటరామారావు తెలిపారు. ఆదివారం ఉదయగిరి నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జి బొల్లినేని వెంకట రామారావు నియోజకవర్గ కార్యకర్తలకు నాయకులకు అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. 2014లో అభివృద్ధిపై దృష్టితో కార్యకర్తలను నాయకులను చూసుకోలేక పోయానని నియోజకవర్గంపై పూర్తి పట్టు సాధించానని ఎవరు.. ఏమిటీ.. అని క్షణంలో చెప్పగల సామర్థ్యాలను నియోజకవర్గంపై పట్టు సాధించానని తెలిపారు. నాయకులు, కార్యకర్తలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని ఒమ్ము చేయనని, పదేపదే అడుగుతుంటే తనకే టికెట్ అని చెప్పుకోవడానికి కొంచెం ఇబ్బందిగా ఉందని, ఎవరు ఎన్ని చెప్పినా పార్టీ టికెట్ తాను కాదంటే తప్ప ఇంకెవరికి పోదని, నియోజకవర్గంలో పోటీ చేసేది తానేనని తెలియజేశారు. తన వద్ద డబ్బులు లేవని, కొందరు తప్పుడు ప్రజాలు చేస్తున్నారని, తాను పాదయాత్ర మొదలు పెట్టినప్పుడు నుంచి ప్రతీపేద వాడి తట్టానని ప్రజల సాదకబాధలు తెలుసని టిడిపి కార్యకర్తలు పడుతున్న అవస్థలు గ్రహించానని వారి అభివృద్ధి తన ధ్యేయమన్నారు. గతంలో పార్టీ కోసం ఎన్నికల కోసం తాను అమ్ముకున్న ఆస్తులు విలువ రూ.1200 కోట్లని రాజకీయాల కోసం అంతటి ఆస్థిపాస్తులు పోగొట్టుకున్నానని, తల్లిదండ్రులు గానీ దాతలు గానీ తనకు ఎలాంటి ఆస్థి ఇవ్వలేదని కష్టపడి సంపాదించాను.. పోగొట్టుకున్నానని మళ్లీ తనకు సంపాదించుకునే శక్తి సామర్థ్యాలు ఉన్నాయన్నారు. ఎలక్షన్లో ఏ ఒక్క రూపాయి ఖర్చు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, ఎలక్షన్లకు కావాల్సిన ప్రతి రూపాయిని తానే చెల్లిస్తానని గతంలో అనేక కార్యక్రమాల్లో జరిగిన ఖర్చు ఎవరు పెట్టారని అది నాది కాదా అని కార్యకర్తలను ప్రశ్నించారు. ఎంఎల్ఏ కార్డు అడ్డం పెట్టుకొని డబ్బులు సంపాదించాల్సిన అవసరం తనకు లేదని తన ఎంఎల్ఏ కార్డు టోల్‌ప్లాజాకు తిరుపతి దైవ దర్శనానికి తప్ప మరి దేనికి ఉపయోగపడదని, తనకు కేంద్ర స్థాయిలో మెరుగైన పరిచయాలు ఉన్నాయన్నారు. నా వ్యాపారాలకు ఎలాంటి అవకతవకులు జరగమని తనకు ఆసక్తి సామర్థ్యాలు ఉన్నాయని, అభివృద్ధే ధ్యేయమని తెలియజేశారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ బుజ్జి కృష్ణారెడ్డి, ఉదయగిరి జనసేన నాయకులు నీలి ఓబయ్య నాయుడు, కాకు మహేష్, స్వర్ణ కొండయ్య, వెంగప్ప నాయుడు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గేదెల యజమానులతో మాట్లాడుతున్న పోలీసులు

గేదెల యజమానులకు సూచనలు

ప్రజాశక్తి-మర్రిపాడు

మండలంలోని నందవరం గ్రామంలోని గేదెల యజమానులతో ఆత్మకూరు సిఐ వేణు, మర్రిపాడు ఎస్ఐ విశ్వనాథ్‌రెడ్డి సమావేశమై సూచనలిచ్చారు. జాతీయ రహదారికి సమీపంలోని గ్రామాలలోని గేదెలు రాత్రి పగలు రోడ్డుపై తిరుగుతుండడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని, గేదెల యజమానులు విచ్చలవిడిగా గేదెలను వదలరాదని సూచించారు. ఇటీవల నందవరం సమీపంలో గేదె అడ్డురావడంతో మూడు వాహనాలు ఒకదానికొకటి ఢీకొని ఓ మహిళ మృత్యువాత పడగా, ఇద్దరు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. గేదెలు వల్ల జాతీయ రహదారిపై ప్రమాదాలు జరిగితే సంబంధిత గేదె యజమానిపై కేసులు నమోదు చేస్తామని వారు హెచ్చరించారు. వాహనదారులు జాగ్రత్తలు పాటిస్తే రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చన్నారు. మద్యంతాగి నడిపే వారివల్ల, ర్యాష్ డ్రైవింగ్ వల్ల జరిగే రోడ్డు ప్రమాదాలతో భారీగా ప్రాణ నష్టం జరిగే అవకాశం ఉందన్నారు.

బుడంగుంటలో అన్నదానం

ప్రజాశక్తి-కావలి

కావలి పట్టణం శ్రీధర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ పి.శ్రీధర్ - డాక్టర్ కె.ఝాన్సీ దంపతులు వారి పెద్ద కుమారుడైన పి.జనిత్ పుట్టినరోజు సందర్భంగా సంయుక్త సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సురేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం బుడంగుంట గిరిజన కాలనీలో 150మంది పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో దాతలు డాక్టర్ పి.శ్రీధర్ - డాక్టర్ కె.ఝాన్సీ దంపతులు, వారి కుమారులు పి.శ్రీజనిత్, పి.ఆశ్రిత్ పాల్గొని పేదలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ తన పెద్ద కుమారుడైన శ్రీజనిత్ పుట్టిన రోజు సందర్భంగా పేదలకు ఆకలి తీర్చాలనే ఉద్దేశంతో నేడు పేదలకు అన్నదానం చేశామని తెలిపారు. సంయుక్త సేవా సంస్థ ద్వారా సురేంద్ర చేస్తున్న సేవలను అభినందించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు సురేంద్ర మాట్లాడుతూ డాక్టర్ పి.శ్రీధర్ - డాక్టర్ కె.ఝాన్సీ దంపతులు ఒక నిరుపేద అమ్మాయిని సంయుక్త సేవాసంస్థ ద్వారా దత్తత తీసుకొని ఆ అమ్మాయికి మంచి పోషణ అందించడమే కాకుండా, మంచి విద్యను, విద్యకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేస్తూ ఉన్నారని తెలిపారు.

ఆర్థికసాయం అందజేత

ప్రజాశక్తి-ఉదయగిరి

ఆర్థికసాయం అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులు

సెయింట్ మేరీస్ స్కూల్ చర్చికి మన ఫౌండేషన్ అధినేత మాజీ ఎఎంసి చైర్మన్ మన్నేటి వెంకటరెడ్డి తమ బృందంతో ఫాదర్ సుదర్శన్‌కు రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆదివారం స్థానిక సెయింట్ మేరీస్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ ఆవరణంలో ఉన్న లూర్థు మాత చర్చి మహోత్సవంలో భాగంగా అన్నదాన కార్యక్రమానికి మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి ఆర్థికసాయాన్ని తమ ట్రస్ట్ సభ్యులతో అందజేశారు. అనంతరం చర్చి ఫాదర్ సిబ్బంది మన ఫౌండేషన్ అధినేతకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో బొజ్జ నరసింహులు, నల్లిపోగు రాజా, గాజుల బాబు, అంకయ్య, సుకుమార్, ఆర్షద్ నౌషాద్ పాల్గొన్నారు.

నూతన భవనాలు ప్రారంభం

ప్రజాశక్తి-కావలి

భవనాన్ని ప్రారంభిస్తున్న ఎంఎల్ఏ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి ఏరియా వైద్యశాలలో రూ.20కోట్లతో నూతనంగా నిర్మించిన భవనాలను ఆదివారం కావలి ఎంఎల్ఏ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభా కార్యక్రమంలో డాక్టర్లు మాట్లాడుతూ కావలి ఏరియా వైద్యశాల అభివృద్ధి కోసం ఎంఎల్ఏ రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి ఎంతో కృషి చేశారని, రూ.20 కోట్లతో శిథిలావస్థలో ఉన్న ఏరియా హాస్పిటల్ భవనాలను నిర్మించామని ఏరియా హాస్పిటల్‌లో డాక్టర్లు సిబ్బంది కొరత ఉంటే ఎంఎల్ఏ దృష్టికి తీసుకెళ్లగానే స్పందించి డాక్టర్లను సిబ్బందిని ఏర్పాటు చేయించారని తెలిపారు. ఏరియా వైద్యశాలలో అన్ని వసతులు వచ్చే విధంగా కృషి చేసిన ఎంఎల్ఏ ప్రతాప్‌కుమార్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఎంఎల్ఏ రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కావలి ప్రాంతంలో మరో 150 పడకల ఆసుపత్రి నిర్మాణానికి సుమారు రూ.75 కోట్ల వ్యయంతో నిర్మించేందుకు ముఖ్యమంత్రి అనుమతులకు పంపామని త్వరలో శంకుస్థాపన కార్యక్రమం కూడా చేపడతామని కావలిలో పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే తన లక్ష్యమని తెలిపారు. పేద ప్రజలకు అన్నిరకాల వైద్య సేవలందించాలని ఏరియా వైద్యశాలలో వసతుల కోసం వైద్య అధికారులు ఎప్పుడు వచ్చిన వారి పనులు వెంటనే పరిష్కరించేందుకు తన శాయిశక్తుల కృషి చేస్తున్నానన్నారు. సిఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో కావలి నియోజకవర్గాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తానని తెలిపారు. ప్రతిపక్షాలు అభివృద్ధిని అడ్డుకునేందుకు తప్ప అభివృద్ధి చేసేందుకు ఏ రోజూ ముందుకు రాలేదని ప్రతిపక్షాల ఆరోపలని పట్టించుకోవాల్సిన అవసరం లేదని కావలి నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు.